
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 7 మే 2025





మనసు కవి పుట్టింది ఇక్కడే!



ఆచార్య ఆత్రేయ పుట్టిన ఇల్లు ఇది. సూళ్లూరుపేట సమీపంలోని మంగళంపాడులో ఇప్పటికీ ఈ పాత మిద్దె ఆయన పాటవలే చెక్కుచెదరకుండా ఉంది. 1915లో ఈ ఇల్లు నిర్మించారు. ప్రస్తుతం ఆయన కుటుంబానికి చెందినవారు ఎవరూ ఈ గ్రామంలో లేరు. ఆత్రేయ అసలు పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. 1921, మే 7న తన అమ్మమ్మగారి ఊరైన మంగళంపాడులో పుట్టారు. ఆత్రేయ తండ్రి వెంకట కృష్ణామాచార్యులు స్వగ్రామం ఉచ్చూరు. తల్లి సీతమ్మది మంగళంపాడు. తండ్రి ఉచ్చూరు జమీన్‌గా కూడా వ్యవహరించారు. తల్లి సీతమ్మ కాన్పుకోసం మంగళంపాడుకు వచ్చింది. ఆత్రేయ అక్కడే పుట్టడంతో నా జన్మస్థలం మంగళంపాడు అని అందరితో చెప్పేవారు. తన 8వ ఏటనే తల్లి మరణించడంతో మంగళంపాడులో మేనమామ వద్ద పెరిగారు. చిన్నప్పటి నుంచీ నాటకాలమీద మోజు ఎక్కువ. ఉచ్చూరులో వీధినాటకాలు వేసేవారు. నాటకాల నేపథ్యం నుంచే 1951లో దీక్ష సినిమాతో సినీరంగ ప్రవేశం చేశారు. 1400కి పైగా సినిమా పాటలు రాశారు. 400 సినిమాలకు మాటలు రాశారు. నిర్మాతగా మారారు. దర్శకత్వం వహించారు. 1961లో అక్కినేని నాగేశ్వరావు నటించిన వాగ్దానం సినిమాకు ఆత్రేయ దర్శకత్వం వహించారు. అన్నమయ్య సినిమా తీయాలని ఆయన కోరిక. ఇందుకోసం తిరుపతిలో పలు ప్రాంతాలను కూడా సందర్శించారు. ఆ కోరిక నెరవేరకుండానే 1989 సెప్టెంబరు 13న ఆత్రేయ మృతి చెందారు. చివరి రోజుల్లో మంగళంపాడులోనే స్థిరపడతానని చెప్పేవారు. ఆయన స్మారకంగా ఆ గ్రామంలోని గిరిజన కాలనీకి ఆత్రేయ కాలనీ అని పేరు పెట్టారు. సూళ్లూరుపేటలోనూ ఆత్రేయ పేరుతో ఒక వీధి ఉంది.

సినీరంగ ప్రవేశం తర్వాతనే కిళాంబి వెంకట నరసింహాచార్యులు ఆత్రేయగా మారారు. పేరుచివరిలోని ఆచార్యనీ, తన గోత్రం అయిన ఆత్రేయనూ కలిపి ఆచార్య ఆత్రేయ అని తనే పేరు పెట్టుకున్నారాయన. ఆత్రేయకు జనం పెట్టిన పేరు మాత్రం మనసు కవి. ఆత్రేయను గొప్ప వేదాంతిగా పేర్కొంటారు. మనసు సంబంధమైన పాటలే ఎక్కువగా రాయడంతో మనసుకవిగా ప్రసిద్ధుడయ్యారు. ఆత్రేయ గొప్ప నాటకాలు రాశారు. సినిమాకన్నా నాటకం మీద ఆయనకు మక్కువ ఎక్కువ అని స్నేహితులు చెబుతారు. ఆత్రేయ స్మారకంగా సూళ్లూరుపేట పట్టణంలో ఆడిటోరియం నిర్మించాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. నాయకులు పూనుకుంటే ఇదేమంత పెద్ద విషయం కాదు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి


మంగళంపాడులో ఆత్రేయ కాలనీ





భక్తుల సమక్షంలో విశ్వరూప స్థూపానికి వడిబాల కడుతూ.. - వజ్రకిరీటంలో మెరిసిపోతున్న గంగమ్మ

● విశ్వరూప స్థూపానికి విశేషాభిషేకం ● తిరుపతి జాతరకు చాటింపు వేసిన కైకాలవాళ్లు

తిరుపతి, మే6(ఆంధ్రజ్యోతి): గంగమ్మ వడిబాల కట్టుకుంది. దీంతో జాతర సంబరాలకు, వేషాల సందడికి తిరుపతి సిద్ధమైంది. మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి పరిమళ, పవిత్ర జలాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. పసుపు, కుంకుమ, నారికేళ, పాలు, పంచామృతం వంటి సుగంధద్రవ్యాలతో అమ్మవారి స్థూపానికి జరిగిన అభిషేకాన్ని వీక్షించిన భక్తజనం పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను సైతం అభిషేకించి, వజ్రకిరీటధారణతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల దంపతులు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, ఆలయ ఇఓ జయకుమార్, కూటమి నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, కొట్టే హేమంత్ రాయల్, రాజారెడ్డి, బాబ్జి, మన్నెం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అవిలాల నుంచి ఐదు ఆలయాలకు సారె

తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక పెద గంగమ్మ, అంకాళమ్మ, ముత్యాలమ్మ ఆలయాలకు అవిలాల నుంచి సారె అందింది. 'ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియచేయడం ఏమనగా...నేటి నుంచి తిరుపతి గంగ జాతర మొదలైందహో..! అంటూ తిరుపతి గంగజాతరకు మంగళవారం రాత్రి కైకాలకులస్థులు చాటింపు వేశారు. గంగమ్మ జన్మస్థలమైన తిరుపతి రూరల్ మండలం అవిలాలలో జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అవిలాల గ్రామ పెద్దలు పూజలు నిర్వహించి పుట్టింట సారెను తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈవో జయకుమార్‌కు అందించారు. అక్కడినుంచి ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి సారె తీసుకొచ్చారు. దీని వెంబడే స్థానిక కైకాల వారు నగర పొలిమేర్లలో చాటింపు వేశారు. జాతర పూర్తయ్యేంత వరకు నగరంలో నివశించేవారు బయటఊర్లకు వెళ్లి నిద్రించకూడదనేది చాటింపు అర్థమని పెద్దలు చెబుతుంటారు. చాటింపు రోజు చిరుజల్లులు పడడం ఆనవాయితీగా వస్తోందని, అందుకు తగ్గట్టే గంగమ్మ తల్లి కరుణించి చల్లబరిచిందని భక్తులు విశ్వసించారు.

● జాతర కమిటీలపై కుమ్ములాటలతో
నవ్వుతున్నారు నాయకా! 8

నేడు సత్యవేడుకు లోకేశ్



సత్యవేడు, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ బుధ, గురువారాల్లో సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం 3.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన 5.10కి సత్యవేడుకు వస్తారు. వీఎంకే కల్యాణ మండపం ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరంలో జరిగే టీడీపీ సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. పార్టీ చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ, సభ్యత్వ నమోదు తదితర కార్యక్రమాల్లో ముందు వరుసలో నిలిచిన కార్యకర్తలను సన్మానించనున్నారు. 6.30 నుంచి 8 గంటల వరకు నియోజకవర్గ నాయకులతో సమావేశమవుతారు. రాత్రి ఇక్కడే బస చేసి.. గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహించి, వినతులు స్వీకరించనున్నట్లు తెలిసింది. అనంతరం రోడ్డు మార్గాన 11 గంటలకు శ్రీసిటీకి చేరుకుని ఎల్‌జీ పరిశ్రమ భూమి పూజలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గాన 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్‌కు వెళతారు.

'సత్యవేడు' కొలిక్కి వస్తుందా? 8

గ్రామీణ ప్రాంతాల్లో గంగమ్మ జాతర సందడి



నడివీధి గంగమ్మకు అంబలి నైవేద్యంగా సమర్పిస్తున్న గ్రామస్థులు

తిరుపతి రూరల్, మే6(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో బుధవారం గంగమ్మ జాతర జరగనుంది. గ్రామాల్లో సందడినెలకొంది. మంగళవారం ఉదయం పలుచోట్ల మహిళలు పెద్ద ఎత్తున నడివీధి గంగమ్మకు అంబలి నైవేద్యంగా సమర్పించారు. పసుపు, కుంకుమ, కొబ్బరికాయ మొక్కు చెల్లించారు. సాయంత్రం పలు గ్రామాల్లో డప్పులు కొట్టి గంగ జాతరకు ఆహ్వానం పలికారు. రాత్రి అమ్మవారిని కొలువుదీర్చారు. బుధవారం ఉదయం అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

వైభవంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, మే 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని రాయలచెరువులోని గంగమ్మకు మేకల తిరుమలరెడ్డి, మాధవిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అంబలిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాదాన్ని గ్రామస్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో చంద్రకళ, రామయ్య, నాగరాజు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపుతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులతో రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, అధ్యాపకులు

తిరుపతిరూరల్, మే6(ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు నైపుణ్యతని పెంచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్)కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బైరాగిపట్టెడలోని కళాశాలలో ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్‌సైన్స్ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన వీడ్కోలుసభలో ఆయన మాట్లాడారు. టెక్నాలజీలో మార్పులకు అనుగుణంగా పరిజ్ఞానాన్ని సాధించాలన్నారు. అంతర్జాతీయసంస్థలతో పోటీపడేలా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సంస్థ చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, హెడ్లు డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, పి.మధుర, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండు ఈగ నివారణకు చర్యలు చేపట్టాలి

పాకాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో పండుఈగ నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన అధికారి శైలజ సూచించారు. కాయ పక్వానికి వచ్చే దశలో ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది పండుఈగ బుట్టలను ఐదు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేస్తే ఉధృతి అరికట్టవచ్చన్నారు. గ్రామ రైతు సేవా కేంద్రసిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలను పొందవచ్చన్నారు. కాయలు కోతకు వచ్చే పదిరోజుల ముందుగా నీటి తడులు ఇవ్వడం ఆపేయాలన్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టి నాణ్యమైన దిగుబడి సాధించాలన్నారు.

శ్మశానాల్లో మౌలిక వసతుల కల్పన : నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శ్మశానాలకు స్థలాలు గుర్తించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులను ఆదేశించారు.చిన్నగొట్టిగల్లులో ఆయన మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సీసీ రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. భాకరాపేట, నెల్లుట్లవారిపల్లె విద్యుత్ సబ్-స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను త్వరగా అమర్చాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. పశువుల దాణా పంపిణీ, గోకులం షెడ్ల నిర్మాణంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఎంపీడీవో గిడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, డిటీ వాసుదేవకుమార్, అన్ని శాఖల అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బర్దన్ కాలనీలో వసతులు కల్పించాలని వినతి

తిరుచానూరు, మే 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచాయతీ పరిధిలోని ఏబీ బర్దన్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు కోరారు. మంగళవారం ఉదయం ఆయన ఎమ్మెల్యే పులివర్తి నానికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ 75 నిరుపేద కుటుంబాలున్న కాలనీలో వీధిదీపాలు లేకపోవడంతో విష కీటకాలు వచ్చేస్తున్నాయన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వసతులు లేవన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తక్షణం వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. రెండు నెలల్లో రోడ్లు, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. నానీకి కలిసినవారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, రాధాకృష్ణ, శాఖ కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి సునీల్, కమిటీ సభ్యులు రాము, లక్ష్మి, నాగేంద్ర, కవిత, దుర్గమ్మ, శివ పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



గొల్లపల్లెలో కారుపై విరిగిపడ్డ చెట్టు కొమ్మ

తిరుపతి రూరల్, మే6(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. వర్షం ఓమోస్తరుగానే పడినా ఈదురుగాలులు బంగా వీచాయి. పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయ ఏర్పడింది. పలుగ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చిరిగిపోయాయి. సి.గొల్లపల్లెలో పార్క్ చేసిన కారుపై వేపచెట్టు విరిగిపడింది. దీంతో కారు ధ్వంసమైంది. అద్దాలు పగిలిపోయాయి.

వేడుకగా అమ్మవారి ఆలయ శుద్ధి

● 11 నుంచి వసంతోత్సవాలు



ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు, అర్చకులు

తిరుచానూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) వేడుకగా జరిగింది. ఉదయం ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. సుగంధ ద్రవ్యాల పవిత్ర జలంతో ప్రోక్షణం నిర్వహించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. అమ్మవారి ఆలయంలో ఈనెల 11 నుంచి 13 వరకు వార్షిక వసంతోత్సవాలు జరగనున్నాయి. 10వ తేదీ సాయంత్రం అంకురార్పణ జరుగుతుంది. భక్తులు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. 12వ తేదీ ఉదయం కన్నులపండువలా స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మూడు రోజులూ మధ్యాహ్నం 2.30గంటల నుంచి 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరుగుతుంది. రాత్రి మాడవీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఉత్సవాల రోజుల్లో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవలను టీటీడీ రద్దు చేసింది. ఆలయ శుద్ధి కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, ప్రసాద్, ఏవీఎస్వో సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయానికి ఓ దాత పరదాలను కానుకగా అందజేశారు.

టీటీడీ ఉద్యోగుల కోసం హెల్మెట్ల వితరణ



తిరుమల, మే6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలనే ఉద్దేశంతో ఓ దాత హెల్మెట్లను విరాళంగా అందజేశారు. గుంటూరుకు చెందిన రఘురాం జలాడి అనే వ్యక్తి తన సంస్థలో తయారుచేసే ఓటీహెచ్ బ్రాండ్ హెల్మెట్లను విరాళంగా అందించాలని నిర్ణయించారు. ఈక్రమంలో మంగళవారం 555 హెల్మెట్లను టీటీడీకి అందజేశారు. వీటిని ద్విచక్రవాహనాలపై వచ్చే ఉద్యోగులకు టీటీడీ చైర్మన్, అధికారులు అందజేయనున్నారు.

వ్యాపారి హత్యకేసులో లొంగిపోయిన అనుమానితుడు

పాకాల, మే 6 (ఆంధ్రజ్యోతి): దామలచెరువుకు చెందిన మామిడికాయల వ్యాపారి సత్రసాల అశోక్ కుమార్ (52) హత్యకేసులో అనుమానితుడుగా భావిస్తున్న ప్రకాష్‌రాజ్ అలియాస్ కమ్మ మంగళవారం కోర్టులో లొంగిపోయాడు. తిరుపతి నుంచి న్యాయవాదులతో వచ్చి పాకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయాడు. తనకేమీ తెలియదని, హత్య కేసులో అనుమానిస్తున్నారని, రక్షణ కల్పించాలని కోరాడు. న్యాయమూర్తి ప్రకాష్ రాజ్‌కు 14 రోజుల పాటు రిమాండు విధించారు. పోలీసులు ఇతన్ని జిల్లా జైలుకు తరలించారు. ఈ నెల 1న దామలచెరువు మొగరాల రహదారిపై అశోక్ కుమార్‌ను పట్టపగలే వేటకొడవళ్లతో అతి దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం కావడంతో అనుమానితుడు లొంగిపోయినట్లు తెలిసింది.

విద్యుత్ అదాలత్‌లను ప్రజలు వినియోగించుకోవాలి

● చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి



వినియోగదారుల సమస్యలు తెలుసుకొంటున్న చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి

తిరుపతి(ఆటోనగర్) మే6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అదాలత్‌లను వినియోగించుకోవాలని విద్యుత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. స్థానిక పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ డీఈ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన అదాలత్‌లో ఆయన వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె.రామ్మోహన్ రావు, ఎస్.ఎల్ అంజనీకుమార్, టౌన్ ఈఈ చిన్నకోటి చంద్రశేఖర్ రావు, డీఈఈలు ఆంజనేయులు, మునిప్రసాద్, జయప్రకాష్, రమేష్, ఏఈలు పాల్గొన్నారు

రెండోరోజు విజిలెన్స్ తనిఖీలు

సూళ్లూరుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో మంగళవారం రెండోరోజు కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. నెల్లూరు ఆర్టీసీ ట్రాఫిక్ విభాగానికి చెందిన విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది డిపోలోని పరిపాలన విభాగాల్లో రికార్డులు తనిఖీ చేశారు. బస్సుల కేఎంపీఎల్, సిబ్బంది పనితీరు, సర్వీసుల వివరాల గురించి ఆరా తీశారు. అనంతరం ట్రాఫిక్ విభాగంలో పనిచేసే అధికారుల నుంచి కొన్ని వివరాలు సేకరించినట్లు సమాచారం.

యానాదుల గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిటేడు యానాదుల గురుకుల కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శేషవర్ధన్ కోరారు. ఎంపీసీలో 40, బైపీసీలో 40, హెచ్‌ఈసీలో 40, ఏఅండ్‌పీలో 20 సీట్లు ఉన్నాయన్నారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన యానాదుల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్టీ విద్యార్థులకు విడిగా ప్రతి గ్రూపులోనూ 5శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం లక్ష రూపాయల లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల విద్యా ర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవా లన్నారు. వివరాలకు 9441033367 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల, మే6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 7 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఆదివారం హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. సోమవారం శ్రీవారిని 65,095 మంది దర్శించుకున్నారు. 26,912 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.



సినీ గాయకులు కృష్ణచైతన్య, మృదుల దంపతులు మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.
-తిరుమల, ఆంధ్రజ్యోతి

గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలి

●వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు



తనపల్లె సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కృష్ణబాబు

తిరుపతి రూరల్, మే6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు పేర్కొన్నారు. తనపల్లెలోని సచివాలయాన్ని, స్వయంసహాయక సంఘాల భవనాన్ని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీ4సర్వే ప్రక్రియ, గుర్తించిన డేటా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు, ఎన్‌సీడీసీలు సర్వేప్రక్రియ డేటాపై ఆరాతీశారు. ఈసందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. స్వయం సహాయకసంఘాల సభ్యులు రుణాలకు సంబంధించిన అంశాలతోపాటు ఆరోగ్యపరమైన అంశాలపై కూడా సమావేశంలో చర్చించుకోవాలన్నారు. మహిళా శిశుసంక్షేమశాఖ అందిస్తున్న కిట్స్‌ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పక్కాగా రీసర్వే చేపడుతున్నామన్నారు. ట్రైనీకలెక్టర్ సందీప్ రఘువాన్షి, మహిళా సంఘాల సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రాపురం: గంగిరెడ్డిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌ఛార్జి ఎం.టి. కృష్ణబాబు తనిఖీ చేశారు. 104 వాహనాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు, గర్భవతులకు సరైన సమయంలో వాక్సినేషన్ ఇవ్వాలని సూచించారు. నాన్ కమ్యూనికేషన్ సర్వే ప్రక్రియపై ఆరా తీశారు. బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించిన డేటా ప్రకారం మందులను ఆస్పత్రిలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అదజకారి బాలకృష్ణనాయక్, డీఐవో శాంతకుమారి డీసీహెచ్ఎస్ ఆనంద మూర్తి, సూపరింటెండెంట్ ఉదయశ్రీ, కమ్మపల్లి ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ జావిద్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రూ.19కోట్లతో త్వరలో తలకోన అభివృద్ధి



వ్యవసాయ పనిముట్ల పంపిణీలో ఎమ్మెల్యే పులివర్తి నాని

ఎర్రావారిపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి): తలకోనను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మంగళవారం ఎర్రావారిపాలెంలో రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేశారు. నాని మాట్లాడుతూ టీటీడీ నిధులు రూ.19 కోట్లతో త్వరలో తలకోన అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. రూ.5 కోట్లతో ఎర్రావారిపాలెం-ఎల్లమంద, రూ.10కోట్లతో ఎర్రావారిపాలెం- తలకోన రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. రూ.22 కోట్లతో తలకోన నీటిని మండలంలోని చెరువులకు అనుసంధానం చేసేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు వేశారన్నారు. వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తానేమీ ఎర్రచందనం డబ్బుతో అపార్టుమెంట్లు కట్టుకోలేదన్నారు.. ఉపాధిహామీలో గోకులాలు నిర్మిస్తే ఓర్వలేక నిందలు వేయడం సరికాదన్నారు. సమావేశంలో ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ పరమేశ్వర స్వామి, ఏవో ఖాదర్ భాషా,నాయకులు రఘునాథ,మహేష్ నాయుడు, పవన్, సురేంద్ర బాబు, విజయారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారిమెట్టు దారిలో మరిన్ని సౌకర్యాలు

●టీటీడీ ఈవో శ్యామలరావు



శ్రీవారిమెట్టుమార్గంలో పరిశీలిస్తున్న శ్యామలరావు

చంద్రగిరి, మే6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు శ్రీవారిమెట్టుమార్గంలో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. టోకెన్లు పొందేందుకు భక్తులు అసౌకర్యానికి గురవుతున్నట్టు తెలియడంతో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఆయన మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ మెట్లదారిలో పరిశుభ్రత, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీటి కుళాయలను పరిశీలించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. శ్రీవారిమెట్టు వద్దకు ఆటోలు విచ్చలవిడిగా చార్జీలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. తిరుపతి నుంచి శ్రీవారిమెట్టు మార్గం వరకు బస్సుల సంఖ్య పెంచే విషయాన్నీ, టోకెన్ల జారీ కౌంటర్లను పెంచే అంశాన్నీ పరిశీలిస్తామని చెప్పారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం, డిప్యూటీఈవో లోకనాథం కూడా ఈవో వెంట ఉన్నారు.

మామిడి ఎగుమతి కేంద్రం పరిశీలన

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు మార్కెట్‌యార్డులోని వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ కేంద్రాన్ని రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ద్వారా మామిడికాయల క్యూరింగ్, కూలింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్రాసెసింగ్ తరువాత మామిడి కాయలను నెదర్లాండ్, జర్మనీ, యూకే, న్యూజిల్యాండ్, సౌత్‌కొరియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు కలెక్టర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రోజుకు పది టన్నులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఆర్డీవో రామ్మోహన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరధరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా అయూబ్‌ఖాన్, గురవయ్య





పి.అయూబ్‌ఖాన్-కె.గురవయ్య

తిరుపతి(ఆటోనగర్) మే6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) డైరెక్టర్లుగా పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్యలను నియమిస్తూ ప్రభుత్వ ఇంధనశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 30న పదవీ విరమణ చేసిన అయూబ్ ఖాన్‌ను ప్రాజెక్టు డైరెక్టర్‌గా, గత ఏడాది మే31న పదవీ విరమణ చేసిన కె.గురవయ్యలను టెక్నికల్ డైరెక్టర్‌గా నియమించారు.

నేడు నాయుడుపేట పోలేరమ్మ జాతర



నాయుడుపేట/టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతర వేడుకగా సాగుతోంది. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన పోలేరమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఉదయం ఘటంతో ప్రారంభమయ్యాయి. ఘటం, దున్నపోతుకు గ్రామంలో ఇంటింటా హారతులు ఇస్తూ పూజలు చేసి మడిబియ్యం సమర్పించుకుంటున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి పీఠాన్ని నిర్మింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారి నిలుపు, బుధవారం జాతర నిర్వహించనున్నారు. సంప్ర దాయం ప్రకారం అమ్మవారి పుట్టినిల్లు అయిన పడమటి వీధి బోయపాళెం లోని కుమ్మరిమిట్టలో పోలేరమ్మ విగ్రహాన్ని తయారు చేస్తారు. మంగళవారం రాత్రి అత్తవారి ఇల్లు అయిన శెట్టిపల్లివారి వీధిలోని అలంకరణ గుడికి తీసుకువస్తారు. అక్కడ అమ్మవారి విగ్రహానికి కళ్లు అమర్చి పూజలు నిర్వహిస్తారు. బుధవారం వేకువజామున సప్పరంపై పోలేరమ్మ కొలువుతీరిన వెంటనే బజారు వీధికి దక్షణం వైపు ఉన్న గ్రామస్తులంతా అమ్మవారికి కుంభాలు పోసి కోళ్లు, పొటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బజారు వీధి నుంచి బ్రాహ్మణ వీధి మీదుగా గడియారం సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. దారి పొడవునా భక్తులు పూర్ణకుంభాలు పోసి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామోత్సవం అనంతరం పోలేరమ్మ విగ్రహాన్ని గడి యారం సెంటర్ వద్ద చావిడి ఎదుట చలువ పందిరిలో ప్రతిష్టిస్తారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం గ్రామ సరిహద్దుల్లో పొలికూడ చల్లి చిన్నమాల గ్రామస్తులు బలి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం అత్తవారిల్లుగా పిలుచుకునే పాత పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో అమ్మవారు విడిది చేస్తారు. తరువాత బేరిపేట నుంచి సప్పరం తరలిరాగా పోలేరమ్మ గ్రామోత్సవానికి వెళుతుంది. దర్గా రోడ్డు సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం నిమజ్జనం కోసం రాజగోపాల పురానికి తరలడంతో పోలేరమ్మ జాతర ముగుస్తుంది.

వరసిద్ధుడి అంతరాలయ దర్శనానికి సేవా టికెట్?

● ఎంత ధర పెట్టాలన్న దానిపై దేవదాయశాఖ తర్జనభర్జన

ఐరాల(కాణిపాకం), మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అంతరాలయ దర్శనానికి ప్రత్యేకత ఉంది. వరసిద్ధుడి దర్శనానికి రోజూ వేల సంఖ్యలో భక్తులు కాణిపాకం విచ్చేస్తుంటారు. వీరికి ఉచితం, రూ.100, రూ.150 దర్శనాలున్నాయి. అందరూ క్యూలైన్ల ద్వారా స్వామిని మహా మండపం నుంచి దర్శించుకుంటారు. ఆలయ పునర్నిర్మాణం జరిగాక నూతనంగా అంతరాలయ దర్శనాన్ని ఆలయాధికారులు.. దేవదాయశాఖ అనుమతితో ఏర్పాటు చేశారు. ఈ దర్శనానికి ఇప్పటివరకు ఎలాంటి టికెట్ లేదు. దర్శనానికి ఎక్కువగా ప్రముఖులకే అవకాశం కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతరాలయ దర్శనానికి సేవా టికెట్ అమలు చేయాలని దేవదాయశాఖ ఆలోచిస్తోంది. ధర ఎంత పెట్టాలన్న దానిపై తర్జనభర్జన పడుతోంది. ఒకవేళ సేవా టికెట్ అమల్లోకి వస్తే ఆలయ ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. భక్తులెవరైనా ఈ టికెట్ కొనుగోలు చేసి, స్వామిని దగ్గరగా చూసే అవకాశమూ లభిస్తుంది.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



నారాయణవనం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలసియున్న పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో మే 11 నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి తోమాల సేవ కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్యులు, ఆలయాధికారి నాగరాజు, భరత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం

పిచ్చాటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... స్థానికులు అందించిన సమాచారంతో పక్కాగా మాటు వేసిన పోలీసులు తమిళనాడుకు తరలుతున్న అక్రమ ఇసుక టిప్పర్‌ని మంగళవారం ఉదయం అప్పలరాజుకండ్రిగ పరిసరాల్లో స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా, తమిళనాడుకు చెందిన పొన్నేరి పట్టణ వాసి ముత్తు కుమార్ ఈ ఇసుక స్మగ్లింగ్‌లో సూత్రధారి అని చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. అతడిని త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. స్థానికంగా కూడా కొంతమందికి అక్రమ ఇసుక రవాణాలో ప్రమేయం ఉందని, సమాచారం సేకరిస్తున్నామని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు

పేకాట రాయుళ్ల అరెస్టు

రేణిగుంట మే 6 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు పేకాట రాయులను గాజులమండ్యం పోలీసులు మంగళవారం రాత్రి గువ్వల కాలనీలో అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గువ్వలకాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద రూ.2400 స్వాధీనం చేసుకున్నారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు గంగమ్మల జాతర

పలు మహాశక్తుల ఆలయాల్లోనూ జాతర సంబరం

తిరుపతి- ఆంధ్రజ్యోతి

ఊరంతా గంగ జాతర వేడుకలకు సిద్ధమవుతోంది. తాతయ్యగుంట చిన గంగమ్మ ఆలయంతో పాటు అమ్మవారి సోదరీమణులుగా పిలుచుకునే మరో ఆరు ఆలయాల్లోనూ జాతర వైభవం ఉంటుంది. అదేవిధంగా పలు మహాశక్తుల ఆలయాలలోనూ, నడివీధి గంగమ్మల దగ్గర కూడా జాతర శోభ కనిపిస్తుంది. రాష్ట్ర పండుగగా గుర్తింపు వచ్చిన నేపథ్యంలో తాతయ్యగుంట గంగమ్మ సోదరిలుగా పూజలందుకుంటున్న వేశాలమ్మ, తాళ్లపాక పెదగంగమ్మ, అంకాళమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, నేరెళ్లమ్మ అమ్మవార్ల చరిత్ర ఓ సారి చూద్దాం..

● ప్రత్యేక ఆకర్షణ చిన గంగమ్మదే



అందరికంటే చిన్నదైన తాతయ్యగుంట చిన గంగమ్మ ఆలయంలోనే జాతర వైభవం కేంద్రీకృతమైవుతుంది. తాతయ్యగుంటలో వెలసిన చినగంగమ్మంటే అక్కగార్లకు వల్లమాలిన ప్రేమ కావడం వల్ల, చిన్నక్క గుడిలో జరిగే బ్రహ్మాండమైన వేడుక చూసి తక్కిన సోదరిలు మురిసిపోతుంటారని ఔచిత్యం. కొత్త గుడితో పాటు సారెలు, సిరులు, కిరీటాలు, పోటెత్తే భక్త జనం అంతా ఆమె ఖాతాలోనే ఎక్కువ వుంటాయి.

● పెదగంగమ్మ ఆలయంలో...



గాంధీ విగ్రహం ఎదురుగా వున్న తాళ్లపాక పెదగంగమ్మ ఆలయంలోనూ గంగజాతర వేడుకలు వారం రోజులపాటు ఘనంగా జరుగుతాయి. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న పెదగంగమ్మ ఆలయంలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏవిధంగా పూజాది కార్యక్రమాలు జరుగుతాయో ఇక్కడ కూడా అదే రీతిన ఉంటాయి. స్థానిక భక్తులతో పాటు ఆలయానికి బస్టాండు దగ్గర కావడంతో యాత్రికులు సైతం అమ్మవారిని దర్శించుకుని తరిస్తుంటారు. కీ.శ.15వ శతాబ్దంలో తాళ్లపాక అన్నమయ్యకు ఇనాంగా ఇచ్చిన ప్రాంతంలో వెలియడంతో తాళ్లపాక గంగమ్మగా మారిందని ప్రతీతి. కాగా జాతర చివరరోజు చినగంగమ్మతో పాటు ఈమెకు కూడా విశ్వరూపాన్ని ఏర్పాటుచేయడం...చెంప నరకడం విశేషం.

● వేషాలకు ప్రత్యేకం వేశాలమ్మ



స్థానిక పల్లెవీధిలోని వేశాలమ్మ జాతర వేషాలతో భక్తులకు దర్శనమిస్తోంది. ఏ గంగమ్మకు లేని పూర్తి రూపం వేశాలమ్మకు ఉండడంతో అలంకరణ అనంతరం భక్తులకు సమ్మోహన పరుస్తోంది. జాతర వేషాలు వేసిన భక్తులు తొలుత వేశాలమ్మను దర్శించుకుని తర్వాత చినగంగమ్మ, పెద గంగమ్మలను దర్శించుకుని వేషం తొలగిస్తారు. ఈ ఆలయం కూడా దేవదాయ శాఖ పరిధిలోనే ఉంది.

● అలంకరణ రూపిణి అంకాళమ్మ



స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదురుగా గల పాత తిరుచానూరు రోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయంలో జాతర సంబరం కనిపిస్తోంది. తిరుపతికి గ్రామదేవతగా పూజలందుకున్న అంకాళమ్మ ఆలయం కూడా దేవాదాయా శాఖ పరిధిలో వుంది.

● మాతమ్మ ముందు చిందులు



స్థానిక గాంధీపురంలో కొలువైన మాతమ్మ ఆలయ ప్రాంగణం జాతర సమయంలో పలకల చప్పుళ్లు, చిందులతో హోరెత్తుతోంది. గంగజాతరలో మాతమ్మకు ప్రాధాన్యత ఉంది. మాతంగి వేషధారులు తొలుత ఇక్కడ నుంచే తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ.

● మురిసే ముత్యాలమ్మ



ఒకప్పుడు పొలిమేరు స్థానిక చింతల చేనులో ముత్యాలమ్మ తన అక్కచెల్లెళ్లకు జరుగుతున్న జాతర వైభవాన్ని చూసి మురిసిపోయినట్లుగా కొలువుదీరింది. చింతల చేను ప్రాంతవాసులు జాతర రోజుల్లో అమ్మవారికి పెద్దఎత్తున పొంగళ్లు పెట్టుకుని అమవారిని దర్శించుకుంటారు.

● అక్కల నడుమ నేరేళ్లమ్మ



తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి దక్షిణ దిక్కున నేరేళ్లమ్మ ఆలయంలోనూ భక్తుల తాకిడి ఉంటుంది. గంగమ్మ ఆలయానికి వచ్చిన భక్తులు చాలా మంది నేరేళ్లమ్మను దర్శించుకుంటారు. నేరేళ్లమ్మకు అటు ఇటూ పెద గంగమ్మ, చినగంగమ్మ రూపాలు ఉండడం ఇక్కడ ప్రత్యేకత.

● జాతర ఏర్పాట్లపై కమిషనర్ పరిశీలన



గంగజాతర ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య మంగళవారం ఉదయం అధికారులతో కలసి పరిశీలించారు. భక్తులు పొంగళ్లు పెట్టే ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. తాగునీరు అందేలా పలుచోట్ల కౌంటర్లు పెట్టాలన్నారు. జాతర సమయంలో భక్తులు సమన్వయంతో వ్యవహరించాలని, వృద్ధులు, పిల్లలు పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని భక్తులకు సూచించారు. కమిషనర్ వెంట డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, డీఎస్పీ భక్తవత్సలం, ఎస్ఈలు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు. సాయంత్రం కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతరకు సర్వం సిద్ధం



తిరుపతి గంగజాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెండింగ్‌లో ఉన్న ఫ్లోరింగ్, ప్రహరీ పనులను పూర్తి చేశాం. జాతరను జయప్రదం చేసేందుకు కలెక్టర్, కమిషనర్లు, ఎస్పీలు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కలెక్టర్, కమిషనర్లు పూర్తిగా జాతర ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో కూటమి నేతల చేయూతతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. టీటీడీ, కార్పొరేషన్, తుడా సహకారం మరువలేనిది. ఈసారి రూ.300 దర్శనాన్ని రద్దుచేశాం.

- జయకుమార్, ఈవో,
శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం

● గంగమ్మ వేషంలో గంగమ్మ పాత్రధారి

ప్రముఖ భరతనాట్య గురువు, రంగస్థల నటి శైలజా రెడ్డి గంగమ్మ వేషంతో తొలిరోజు ఆలయానికి వచ్చారు. అభిషేకానంతరం అమ్మవారు అలంకరణ ఏవిధంగా ఉంటుందో ఆ విధంగా మేకప్ వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెతో పలువురు భక్తులు సెల్ఫీలు దిగారు. గత ఏడాది గంగజాతర సమయంలో అభినయ ఆర్ట్స్ నిర్వహించిన గంగమ్మ నాటకంలో ఆమె గంగమ్మ పాత్ర ధరించి మెప్పించారు.

● ముఖ కవచం అలంకరించరా?

అభిషేకానంతరం గంగమ్మ వజ్రకిరీట ధారణిగా భక్తులకు దర్శనమిచ్చారు. అయితే బంగారు ముఖ కవచం అలంకరించకపోవడంపై భక్తులు నిరాశ చెందారు. జాతర జరిగినన్ని రోజులైనా వజ్రకిరీటంతో పాటు బంగారు ముఖకవచం కూడా అలంకరించాలని భక్తులు కోరుతున్నారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ

తిరుపతి, మే6(ఆంధ్రజ్యోతి): గంగజాతర చాటింపు సందర్భంగా స్థానిక 35వ డివిజన్‌లోని నడివీధి గంగమ్మ ఆలయం వద్ద మంగళవారం టీడీపీ నాయకులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సుబ్బు యాదవ్, శంకర్‌యాదవ్, వినోద్‌రాయల్, ఆముదాల వెంకటేష్, శేషాద్రి రాయల్ తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మ మూలవిరాట్‌కు పూజలు



మంగళవారం.. తాతయ్యగుంట ఆలయం ముందు అమ్మవారి పాదాల వద్ద పూజలు





అవిలాల నుంచి తీసుకొచ్చిన సారెకు పొలిమేర వద్ద పూజలు - వేయి కళ్ల దుత్తలతో మొక్కులు

మురిపించిన నీలి మబ్బులు







తిరుపతి అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. నగరంపై తెల్లని మబ్బులు కమ్ముకుని కనువిందుచేశాయి. వర్షం ప్రారంభమై కాసేపటికే ఆగిపోయింది. పాదచారులు, వాహనదారులు, వీధివ్యాపారులు వర్షంలో తడిసి పోయాయి. అయితే వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.



రాస్ సేవలు చిరస్మరణీయం



మునిరత్నం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తదితరులు

తిరుపతి(ఆటోనగర్) మే6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవాసమితి ద్వారా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దివంగత నేత పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నంనాయుడు అన్నారు. తిరుపతిలోని రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం డాక్టర్ గుత్తా మునిరత్నం నాల్గవ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 500 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 70 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 30 మందికి కుట్టు మిషన్లు, ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్ అందించారు. ఈ కార్యక్రమాల్లో రాస్ సంయుక్త కార్యదర్శి మమత, డైరెక్టర్లు వి.నాగరాజు, బాలాజీనాయుడు, సమత, యువరాజు, మోహన్ కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజరు, ఉమాపతి, బాలాజీచౌదరి వివరించారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి



అండర్ బ్రిడ్జి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి(సెంట్రల్) మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి -రేణిగుంట రైలు మార్గంలో రెండు ప్రాంతాల్లో జరుగుతున్న అండర్ బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలని ఎంపీ గురుమూర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం రైలు మార్గంలోని హీరో హోండా షోరూమ్ ఎదుట వున్న ఎల్‌సీ నెంబరు107, సీఆర్ఎస్ సమీపంలోని 109 రైల్వే గేట్ల వద్ద జరుగుతున్న అండర్ బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పనులు పూర్తయితే ద్విచక్రవాహన చోదకులకు ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. ఆయనవెంట రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, రైల్వే భద్రతా సిబ్బంది ఉన్నారు.

సీపీఎం సమావేశాలను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్) మే6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం నుంచి జరగనున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సమా వేశాలాను జయప్రదం చేయా లని, గురువారం జరిగే బహి రంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు విజ్ఞప్తి చేశారు. సమావేశాలకు సంబం ధించిన మంగళవారం నగరంలో ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు.

బీసీలపై చిన్నచూపు : వైసీపీ

తిరుపతి(జీవకోన), మే 6(ఆంధ్రజ్యోతి): బీసీలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వైసీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు చిన్నియాదవ్ అన్నారు. మంగళవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుట్టుమిషన్ల పేరుతో బీసీ మహిళలకు ప్రభుత్వం కుచ్చుటోపీ పెడుతోందన్నారు. ఈ సమావేశంలో వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తత్వాన్ని ఆవిష్కరించిన మహాభారతం



మాట్లాడుతున్న చదలవాడ కృష్ణమూర్తి

తిరుపతి అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): మానవ మనస్తత్వాన్ని ఆవిష్కరించిన మహాగ్రంథమే మహాభారతమని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ పేర్కొన్నారు. స్థానిక అన్నమాచార్య కళామందిరంలో అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో వరుణ కటాక్షం కోసం విరాటపర్వంపై మూడు రోజుల పాటు తలపెట్టిన ప్రవచన కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచ ఆధ్యాత్మిక రాజధాని అయిన తిరుపతిలో విరాటపర్వంపై ప్రవచన కార్యక్రమం జరగడం శుభపరిణామమన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రత్యేకాధికారి శ్రీరామ్‌రఘునాథ్ మాట్లాడుతూ విరాటపర్వం కార్యక్రమం నిర్ణయించిన రోజే వర్షం కురవడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి సురేంద్రనాయుడు, డాక్టర్ ద్వారం లక్ష్మి, ఆచార్య దేవసేననాయుడు, జి.ఎల్.మనోహర్, ఎ.పి.నాయుడు పాల్గొన్నారు.



జోరుగా తాటిముంజల విక్రయిస్తున్న వ్యాపారస్తులు

తాటిముంజలు తిందామా..!

నగరంలో జోరుగా విక్రయాలు



తిరుపతి అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఒకటి తింటే మరొకటి తినాలపించే రుచి.. వేసవి నుంచి ఉపశమనం.. వెరసి తాటిముంజల విక్రయం నగరంలో జోరుగా సాగుతోంది. ఎస్వీ క్యాంపస్‌స్కూల్ ముందు, ఎస్వీయూ మార్గం, చెర్లోపల్లి రహదారి, ఏడీ బిల్డింగ్, స్విమ్స్ ఆస్పత్రి మార్గం, భవానీనగర్, మున్సిపల్ ఆఫీస్ కూడళ్లు, కపిలతీర్థం, రేణిగుంట, తిరుచానూరు మార్గాలలో తాటి ముంజల విక్రయాలు సాగుతున్నాయి. పాకాల, పూతలపట్టు, తమిళనాడుల నుంచి నాణ్యతతో కూడిన తాటిగొత్తులను వాహనాల్లో తీసుకొచ్చి డజన్ల లెక్కన విక్రయిస్తున్నారు. ప్రజలు కూడా ఆరోగ్యం, చల్లదనం కోసం ముంజలను ఇష్టంగా కొనుగోలుచేస్తున్నారు.



పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభం



స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, మే6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలోని 'దశావతార-అష్ట లక్ష్మి' మండపంలో మంగళవారం సాయంత్రం పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజైన మంగళవారం మలయప్పస్వామి గజవాహనంపై కొలువుదీరి ఉభయనాంచారులతో కలిసి మండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. వివిధ హంగులతో శోభిల్లుతున్న పెండ్లి మండపంలో నిత్య నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు, మాల పరివర్తనం, పూలబంతులాట, నూతన పట్టువస్త్రాల సమర్పణ కోలాహలంగా జరిగాయి. స్వామికి కొలువు నిర్వహించాక చతుర్వేద పారాయణం, మలహారి, దేశిక, సౌరాష్ట్ర, వారహి, కదన కుతూహల, నీలంబరి వంటి వివిధ రాగ-తాళ వాయిద్యాల నడుమ స్వామి వార్ల కల్యాణం జరిగింది. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించాక శ్రీదేవి, భూదేవి సహితుడైన స్వామి అశేష భక్త జనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యురాలు పనబాక లక్ష్మి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, పెండ్లి మండపాన్ని టన్ను పండ్లు, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌తో దాదాపు 150 మంది గార్డెన్ సిబ్బంది, 50 మంది ఎలక్ట్రిక్ సిబ్బంది అలంకరించారు.

పెలికాన్ పక్షికి వడదెబ్బ



సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద ఓ ఇంటి సమీపంలో పెలికాన్ పక్షికి వడదెబ్బ తగిలి పడిపోయింది. నెర్రికాలువ వద్ద సేదతీరుతున్న పెలికాన్ పక్షికి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలింది. స్థానికులు గమనించి వన్య ప్రాణి అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు పెలికాన్ పక్షికి పశువైద్య శాలలో వైద్య పరీక్షలు చేయించి కుదిరి చెరువులో విడిచిపెట్టారు. పెలికాన్‌ను రక్షించిని సిబ్బందిని డీఎఫ్‌వో హారిక, ఎఫ్ఆర్‌వో నరసింహారావు అభినందిచారు.

– సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సత్యవేడు కొలిక్కి వస్తుందా?

● టీడీపీ కోటలో వర్గాలతో బీటలు ● నారా లోకేశ్ కొలిక్కి తెస్తారని శ్రేణుల్లో ఆశలు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): యువనేత, మంత్రి నారా లోకేశ్ బుధవారం సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులతో సమావేశం అవుతుండడంతో ఇక్కడి రాజకీయాలపై జిల్లా అంతా ఆసక్తి నెలకొంది. టీడీపీకి తొలి నుంచీ బలమైన పట్టున్న నియోజకవర్గంలో వర్గవిభేదాలు తారస్థాయిలో ఉన్న సమయంలో లోకేశ్ ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ తొలగుతుందా? నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించబోతున్నారు? అనే అంశాలు చర్చగా మారిన నేపథ్యంలో లోకేశ్ అన్నీ చక్కదిద్దుతారనే ఆశాభావంతో ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి.

తొలినుంచీ నాయకత్వ సంక్షోభమే!

సత్యవేడు నియోజకవర్గం తొలి నుంచీ టీడీపీకి బాగా పట్టున్న ప్రాంతం. పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ పది సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు సార్లు టీడీపీ అభ్యర్థులు గెలిచారు. టీడీపీ నేతల నడుమ వర్గ విభేదాల కారణంగానే ఆ మూడు సార్లూ ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నియోజకవర్గంలో తొలినుంచీ టీడీపీకి నాయకత్వ సమస్య ఎదురవుతూనే వుంది. తొలి ఎన్నికల్లో పోటీ చేసిన తలారి మనోహర్ మొదలుకుని తర్వాత వచ్చిన సురాజ్, నారమల్లి శివప్రసాద్, హేమలత, తలారి ఆదిత్యతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వరకూ ఎవరూ బలంగా నిలదొక్కుకోలేకపోయారు. ఐదేళ్లలోపే పార్టీ నుంచీ బలమైన వ్యతిరేకత ఎదుర్కొనడం, తదుపరి ఎన్నికల్లో టికెట్ కోల్పోవడం, నియోజకవర్గ ముఖచిత్రం నుంచీ తెరమరుగు కావడం జరుగుతోంది.

ఐదేళ్ల నుంచీ దారీ తెన్నూ లేని పార్టీగా..

గత ఐదేళ్లూ సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ మరీ దారుణ పరిస్థితులను ఎదుర్కొంది. 2014 ఎన్నికల్లో గెలిచిన తలారి ఆదిత్యకు 2019లో టికెట్ దక్కలేదు. 2019 ఎన్నికల్లో పార్టీ టికెట్‌పై పోటీ చేసిన జేడీ రాజశేఖర్ ఓడిపోయారు.



సత్యవేడులో లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఆ తర్వాత ఆయనకు ఇంచార్జి పదవి దక్కలేదు. కొంత కాలం ఇంచార్జి లేకుండా గడిచాక మాజీ ఎమ్మెల్యే హేమలతకు ఆ బాధ్యతలు అప్పగించారు. నెలల వ్యవధిలోనే ఆమెను తప్పించి ఆమె కుమార్తె డాక్టర్ హెలెన్‌కు ఇంచార్జి ఇచ్చారు. దీంతో నియోజకవర్గంలో హేమలత (హెలెన్) వర్గం, జేడీ రాజశేఖర్ వర్గాలు ఏర్పడ్డాయి. తీరా 2024 ఎన్నికల్లో వీరిద్దరినీ పక్కన పెట్టి అధిష్ఠానం అధిష్ఠానం వైసీపీ నుంచీ వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి టికెట్ ఇచ్చింది. ఆయన గెలుపునకు హేమలత, రాజశేఖర్ వర్గాలు పనిచేయలేదు. రాజశేఖర్ ఇండిపెంటెండ్‌గా పోటీ చేశారు. హేమలత వర్గం మరో ఇండిపెండెంట్ రమేష్‌కు మద్దతిచ్చింది. అయితే కోనేటి ఆదిమూలం ఇంతటి ప్రతికూలతను కూడా అధిగమించి పార్టీ సానుకూల ప్రభంజనం వల్ల ఎమ్మెల్యేగా గెలిచారు.

సస్పెన్షన్‌లోనే ఆదిమూలం

గెలిచినా కోనేటి ఆదిమూలం రాజకీయంగా స్థిరంగా అయితే లేరు. టీడీపీ వారికి కాకుండా వైసీపీ నుంచీ తన వెంట వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అధిష్ఠానానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనికితోడు ఓ మహిళతో వివాదం కారణంగా క్రిమినల్ కేసులో చిక్కుకుని పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినడానికి కారకులయ్యారు. దీంతో పార్టీ నుంచీ ఆయన్ను సస్పెండ్ చేశారు. ఆ కేసు న్యాయస్థానంలో రాజీ చేసుకున్నప్పటికీ పార్టీ సస్పెన్షన్ మాత్రం ఇంకా తొలగలేదు. దీంతో ఏడు నెలలకుపైగా నియోజకవర్గంలో పార్టీకి దారీ తెన్నూ లేకుండా పోయింది. నాయకులు, కార్యకర్తలూ పెద్దగా ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లడం లేదు. గత ఎన్నికల సమయంలో పరిశీలకుడిగా ఉన్న చంద్రశేఖర్ నాయుడు ఓ వర్గ నేతగా ఎదిగారు. ఆయనకు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పదవి దక్కుతుందని అనుచరవర్గం ఆశిస్తోంది. మాజీ ఎమ్మెల్యే హేమలత అడపాదడపా వచ్చి వెళుతున్నారు. కొద్దోగొప్పో వర్గాన్ని కూడగట్టుకుని ఇంచార్జి పదవిని ఆశిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి వంద రోజుల తర్వాత చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణకు కో ఆర్డినేటర్‌గా నియమితులైన శ్రీపతిబాబు కూడా ఒక వర్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. వీరిలో చంద్రశేఖర్ నాయుడు పక్షం రోజుల కిందట అభివృద్ధి పనులు ప్రారంభించడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎస్సీ నియోజకవర్గం అని అలుసుగా తీసుకుంటున్నారని, ఇతర నియోజకవర్గాల్లో ఇలా చేయగలరా అంటూ బహిరంగంగానే విమర్శలు చేశారు. ఇలా నేతలు వర్గాలుగా విడిపోవడంతో- నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం, పనుల కోసం ఎవరిని ఆశ్రయించాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. కాగా యువనేత నారా లోకేశ్ నేడు సత్యవేడుకు వచ్చి పార్టీ శ్రేణులతో సమావేశం కానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఆశాభావంతో వున్నాయి. ఎవరో ఒకరికి పార్టీ పగ్గాలు అప్పజెప్పి నియోజకవర్గంలో అభివృద్ధి జరిగేలా నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నారు.



చిన్నారితో మొక్కులు





సారె తీసుకొస్తున్న కైకాల వంశీయులు - అమ్మవారి వేషంలో..



మంగళవారం రాత్రి అవిలాల నుంచి సారె ఊరేగింపు

వేషాల జాతర షురూ

● నేడు బైరాగి వేషం

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జాతరకు చాటింపు వేశారని తెలియగానే నగరంలోని యువతతో పాటు చిన్నపిల్లల్లో ఆనందం ఉరకలేస్తుంది. వారం రోజులపాటు వివిధ వేషాలతో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. బుధవారం బైరాగి వేషంతో వేషాల జాతర మొదలవుతుంది. శరీరమంతా నామం కొమ్ము లేదా విభూతి పూసుకుంటారు. రేళ్ల కాయల మాలలు మెడలో ధరించి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. వేషంతో ఇంటి దగ్గర బయల్దేరినప్పటి నుంచి బూతులతో జనాలను భయపెట్టడం జాతర ఆచారం. ఇవిగాక పలువురు మహిళలు వేపాకు చీరలు కట్టుకుని, నెత్తిన వేయికళ్ల దుత్తలు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.



గంగమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

నవ్వుతున్నారు..నాయకా!

జాతర ఉత్సవ కమిటీలపై కూటమిలో కుమ్ములాటలు

ఒకటి కాదు, రెండు కాదు నాలుగు జాబితాలు విడుదల

(తిరుపతి, ఆంధ్రజ్యోతి)

తిరుపతి కూటమి నేతల్లోని అనైక్యతకు తిరుపతి గంగజాతర అద్దం పడుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గరవుతున్నా గంగమ్మ గుడికి పాలకమండలిని ప్రకటించలేకపోగా, జాతర నిర్వహణకు ఉద్దేశించిన ఉత్సవ కమిటీని కూడా ఏకాభిప్రాయంతో ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉన్నారు. మార్పులూ చేర్పులూ, అలకలూ కోపతాపాలతో జాతర చాటింపు మొదలైన మంగళవారం సాయంత్రానికి 23 మందితో కలెక్టర్ సంతకంతో ఒక జంబో కమిటీని ప్రకటించారు. మరోవైపు నాయకుల భేషజాలతో సంబంధం లేకుండా జాతర తంతు మాత్రం సంప్రదాయంగా మొదలైపోయింది. ప్రజలు భక్తితో సున్నపు బొట్లుతో, వేషాలతో, దుత్తలతో వచ్చి గంగమ్మను దర్శించుకుని వెళ్తున్నారు.

దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలకు పాలకమండలి లేకపోతే తాత్కాలికంగా ఉత్సవ కమిటీని నియమించి ఉత్సవాలు నిర్వహిస్తారు. గత 20 ఏళ్ల తిరుపతి జాతరలో మూడుసార్లకు పైగా స్థానికాలయాలకు ఇలాగే ఉత్సవ కమిటీలను నియమించారు. ఈ సంప్రదాయం ప్రకారం తిరుపతి గంగమ్మజాతరకు ఉత్సవకమిటీని ఏర్పాటు చేశారు. ఇదే కూటమి నేతల మధ్య అభిప్రాయ భేదాలకు కారణమైంది. కూటమిలోని ఇతర పార్టీల నేతలతో సంప్రదింపుల తర్వాత జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 27 మందితో ఒక జాబితాను తొలుత సిద్ధం చేశారు. ఇందులో సింహభాగం టీడీపీ కార్యకర్తలే ఉన్నారు. దానిని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ద్వారా రాష్ట్ర కమిషనర్‌కు పంపారు. అదేఫైనల్ అనుకుని అందులో పేర్లున్నవారు ఆ జాబితాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకుని శుభాకాంక్షలు అందుకుని సంబరపడ్డారు. ఇంతలో ఏం జరిగిందో ఏమోగాని నాలుగు రోజుల కిందట కలెక్టరేట్ నుంచి డీఆర్వో నరసింహులు పేరుతో 15 మందితో మరో జాబితా విడుదలైంది. ఇందులో తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలతో పాటు వివిధ నామినేటెడ్ పదవులు పొందిన కూటమి నేతలు, మాజీ చైర్మన్లు ఉన్నారు. దీనిపై కూటమి పార్టీల కార్యకర్తలు తీవ్రంగా అసంతృప్తి చెందారు. సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నాయకులపైనే ఆగ్రహం వెళ్లగక్కారు. గంగమ్మ గుడిలో పదినిమిషాలు కూడా కూర్చోని వారిని ఉత్సవ కమిటీలో ఎలావేస్తారని ప్రశ్నించారు. ఇదిలావుంటే ఈ జాబితాలతో సంబంధంలేకుండా డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, నందగోపాల్ నాయుడుల పేరుతో డీఆర్వో మరో ప్రొసీడింగ్స్ ఇచ్చారు.

జాతర తుదికమిటీ సభ్యులు వీరే

గంగజాతర తుది కమిటీలో బాలసుబ్రమణ్యం రెడ్డి, మన్నెం శ్రీనివాసులు, ఆముదాల తులసీరాం,మహేష్ యాదవ్, ఆనంద యాదవ్, ఉమాశంకర్, జలపోతు చంద్రశేఖర్ రెడ్డి, శాంతి కుమారి, అశోక్, దేవరాజులు, నందగోపాల్ నాయుడు, విజయలక్ష్మి, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తమ్మినేని వెంకటేశ్వర్లు, హరిశంకర్, బాబ్జి, సుధాకర్, బుజ్జిబాబు, ఆనంద్, తమ్మిశెట్టి చంద్రశేఖర్, ఎన్వీ నరసింహ యాదవ్, ప్రభాకర్, సోము వేదవతి రాయల్ ఉన్నారు.

కలెక్టర్ సమీక్షతోనూ కొలిక్కిరాలేదు

అసంతృప్తులు, విమర్శల నేపథ్యంలో వివాదానికి తెరవేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ భావించారు. కూటమి ముఖ్యులను కూర్చోబెట్టుకుని సోమవారం కలెక్టరేట్‌లో జాతరపై సమీక్షిస్తూ తుదిజాబితాకోసం పనిచేసేవారి పేర్లు ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. అడిగిందే తడవుగా ఎవరికివారు పెద్ద సంఖ్యలోనే పేర్లు ఇచ్చినట్టు తెలిసింది. ఈ సమయంలో ఇద్దరు నేతలు అలిగి వెళ్లిపోయారని సమాచారం. జాతర కమిటీ జాబితా మళ్లీ మొదటికి రావడంతో.. టీటీడీ బోర్డులోనూ ఇంత మంది ఉండరు కదా.. మీరే తేల్చుకుని జాబితా ఇవ్వండని కలెక్టర్ అన్నట్టు తెలిసింది. కమిటీ కోసం జాతర ఆగదు కదా. మంగళవారం మొదలైపోయింది. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు 21 మంది పేర్లతో కలెక్టర్ పేరిట ఓ జాబితా విడుదలైంది. దానికి కూడా సంతృప్తి చెందని కూటమి నేతలు కలెక్టర్‌పై ఒత్తిడి చేసి మరో ఇద్దరి పేర్లను తగిలించుకున్నారు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో 23 మందితో కలెక్టర్ సంతకంతో మరో జాబితా వెలువడింది. ఏడాదికో సారి జరిగే జాతరనే కలిసి నిర్వహించుకోలేని స్థితిలో కూటమి నేతలు ఉంటే భవిష్యత్తు ఎలా ఉండబోతుందా అనే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

జిల్లాలో పలుచోట్ల అకాల వర్షాలు

● కూలిన వృక్షాలు ● విద్యుత్తు తీగలు తెగి సరఫరాకు అంతరాయం



వెంకటగిరి పట్టణం రాణీపేట వద్ద ఓ దుకాణంపై తిరగబడిన రేకులు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం అకాల వర్షాలు కురిశాయి. 4 గంటల వరకూ ఎండలు, ఉక్కపోతతో జనం సతమతమవగా.. ఆ తర్వాత వాతావరణంలో మార్పు కనిపించింది. వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు, పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, తిరుపతి రూరల్, డక్కిలి, బాలాయపల్లి తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఏర్పేడు మండలంలో గోడకూలి ఇద్దరు మృతిచెందారు. వెంకటగిరి అరగంట పాటు గాలీవానా బీభత్సం సృష్టించింది. వృక్షాలు కూలాయి. దుకాణాలపై రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శ్రీకాళహస్తిలో 6.20 నుంచీ 40 నిమిషాల పాటు హోరుగాలులతో పాటు పడిన వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పుత్తూరు పోలీస్ స్టేషన్, గేటు పుత్తూరు, నారాయణవనం రైల్వే గేటు తదితర చోట్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. కేఎం అగ్రహారం వద్ద విద్యుత్ స్తంభంపై రెండు చెట్లు కూలడంతో ఆయా ప్రాంతాల్లో సరఫరా ఆగిపోయింది. తిరుపతి రూరల్ మండలంలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గొల్లపల్లిలో సర్పంచ్ రవి కారుపై వేపచెట్టు కూలింది. తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో సైతం గాలులతో కూడిన వర్షం కురిసింది.

రెండు చోట్ల గోడకూలి ఇద్దరి మృతి

● ఒకరికి గాయాలు



ఎల్లప్పరెడ్డి (పాతచిత్రం)





గోడకూలడంతో మృతిచెందిన సోమిశెట్టి ఆంజనేయులు

ఏర్పేడు, మే 6(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో మంగళవారం సాయంత్రం గాలివానకు గోడ కూలి ఇద్దరు మృతిచెందారు. చిందేపల్లి దళితవాడలో క్రికెట్ ఆడుతున్న పెద్దలు, పిల్లలు వర్షానికి తలదాచుకోవడానికి మైదానం సమీపంలోని రేకుల షెడ్‌లోకి వెళ్లారు. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో గోడ కూలగా, సోమిశెట్టి ఆంజనేయులు(19) అక్కడికక్కడే మృతి చెందగా కోటేశ్వరరావు(27) గాయపడ్డాడు. ఈయన్ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అలాగే, వికృతమాలకు చెందిన ఎల్లప్పరెడ్డి(60) పొలం నుంచి వస్తుండగా ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో కోళ్ల ఫారం వద్దకు వెళ్లారు. అక్కడ గోడ కూలి ఎల్లప్పరెడ్డిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్ఎస్ ఏపీసీగా గౌరీశంకర్‌రావు



తిరుపతి(విద్య), మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష విభాగం అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ జి.గౌరీశంకర్‌రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన అనంతపురం- హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. డిప్యుటేషన్‌పై పాఠశాల విద్యాశాఖకు బదిలీచేస్తూ ఎస్ఎస్ ఏపీసీగా నియమించారు. ఈ మేరకు మంగళవారం సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు డీఈవో కేవీఎన్ కుమార్ ఇన్‌చార్జిగా నిర్వహిస్తున్నారు. కాగా, శంకర్‌రావు గతంలో వరదయ్యపాళెం ఎమ్మార్వోగా పనిచేశారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు 611 మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాతపరీక్షలకు 611మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. కాగా జిల్లాలో మంగళవారం ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలకు మొత్తం 911మంది అభ్యర్థులకు గాను 611మంది హాజరయ్యారని, 300మంది గైర్హాజరయ్యారని వివరించారు.

కేరళ తరహాలో పర్యాటకాభివృద్ధి

● జిల్లాలో మెండుగా అవకాశాలు

ఉన్నాయన్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు



అధికారులతో సమీక్షిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): కేరళ తరహాలో జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి, జోనల్ ఇన్‌చార్జి కృష్ణబాబు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేరళ తరహాలో మెడికల్, హోటల్, స్పిరిచ్యువల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రాష్ట్రంలో స్థూల జాతీయోత్పత్తిలో జిల్లా 3వ స్థానంలో ఉందని, మొదటి స్థానంలోకి వచ్చేలా అన్ని శాఖల అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలో పెట్టుబడులకున్న అవకాశాల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించాలన్నారు. పరిశ్రమలకు అనుగుణంగా అధునాతన నైపుణ్య శిక్షణ మ్యాన్‌పవర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటసాగులో అధునాతన పద్ధతులను పాటించేలా రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, కమిషనర్ మౌర్య, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలపై ఏనుగుల దాడి

పాకాల, మే 6 (ఆంధ్రజ్యోతి): పదిపుట్లబైలు పంచాయతీ గుండ్లగుట్టపల్లె సమీపంలోని పంటపొలాలపై సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. పంటలను ధ్వంసం చేశాయి. రైతు డి.సరోజమ్మకు చెందిన టమోట పంటను తొక్కివేసి తీవ్ర నష్టం కలిగించాయి. మండల ఉద్యాన అధికారి శైలజ నష్టపోయిన పంటలను పరిశీలించారు.



ఏనుగులు ధ్వంసం చేసిన టమోట పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

చదువుతోనే ఉజ్వల భవిత



విద్యార్థిని అభినందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు, మట్టం శ్రావణి

గూడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తిరుపతి పార్లమెంటు టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభచాటిన చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులు పదో తరగతిలో మంచి ఫలితాలను సాధించడం అభినందనీయమన్నారు. లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి వాటిని సాధించుకోవాలన్నారు. సురేష్, మల్లి, సాయి, మౌలా తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన పెంచాలి

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బీమా పథకాలపై అవగాహన పెంచాలని ఏపీడీ వరప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్య నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 'ఉపాధి కూలీలు - బీమా పథకాలు' అనే అంశంపై క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న సమయంలో కూలీలకు గుండెపోటు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పనులు చేస్తూ పూర్తిగా, పాక్షికంగా అంగవైకల్యం పొందిన వారికి వర్తించే కార్మికశాఖ ఆధ్వర్యంలో కొత్తగా వచ్చిన పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్‌లు కాటయ్య, కరుణాకర్‌రెడ్డి, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

గూడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ భూములను ధనిక ముస్లింలకు అప్పగిస్తూ పేద ముస్లింలను అణిచివేతకు గురిచేసింద న్నారు. ప్రధాని మోదీ ఈ చట్టాన్ని సవరించి వక్ఫ్ భూములు పేద ముస్లింలకు చెందేలా నూతన చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. వక్ఫ్ చట్టంపై ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పహల్గాం ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కోలా ఆనంద్, చంద్రప్ప, వరప్రసాద్, తాజుద్దీన్, మస్తాన్, కిరణ్‌రెడ్డి, దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, బిందు రెడ్డి, నరేంద్ర, భైరప్ప, ప్రకాష్‌నాయుడు, దినకర్ పాల్గొన్నారు.

యానాదుల గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శేషవర్ధన్ కోరారు. ఎంపీసీలో 40, బైపీసీలో 40, హెచ్‌ఈసీలో 40, ఏఅండ్‌పీలో 20 సీట్లు ఉన్నాయన్నారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన యానాదుల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్టీ విద్యార్థులకు విడిగా ప్రతి గ్రూపులోనూ 5శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం లక్ష రూపాయల లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9441033367 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

రెండోరోజు విజిలెన్స్ తనిఖీలు

సూళ్లూరుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో మంగళవారం రెండోరోజు కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. నెల్లూరు ఆర్టీసీ ట్రాఫిక్ విభాగానికి చెందిన విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది డిపోలోని పరిపాలన విభాగాల్లో రికార్డులు తనిఖీ చేశారు. బస్సుల కేఎంపీఎల్, సిబ్బంది పనితీరు, సర్వీసుల వివరాల గురించి ఆరా తీశారు. అనంతరం ట్రాఫిక్ విభాగంలో పనిచేసే అధికారుల నుంచి కొన్ని వివరాలు సేకరించినట్లు సమాచారం.



శిథిలావస్థకు చేరిన తహసీల్దారు కార్యాలయం - గోడలు, అడుగు దెబ్బతిన్న కార్యాలయ వరండా - బీటలువారిన గోడలు

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- వర్షం వస్తే ఉరుస్తున్న పైకప్పు
- పెచ్చులూడి పడుతుండడంతో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ
- తహసీల్దారు కార్యాలయంలో విషసర్పాల బెడద

పెళ్లకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరులోని తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా తహసీల్దారు కార్యాలయం పాడుబడిపోయి భవనానికి పగుళ్లు ఏర్పడ్డాయి. తేలికపాటి వర్షానికే పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఉద్యోగులు, సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో విష సర్పాల బెడద అధికంగా ఉంది. అర్జీదారులు ఉండే మెట్లక్రింద ప్రాంతంలో గతంలో నాలుగు సార్లు నాగుపాములను గుర్తించారు. పాములు పట్టేవారిని పిలిపించి పట్టించారు. తరచూ పాములు సంచరిస్తుండడంతో రెవెన్యూ సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజలు హడలిపోతున్నారు. తహసీల్దారు కూర్చునే గది పూర్తిగా బీటలు వారి శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయంలో గదిని ఆయన ఛాంబర్‌గా ఉపయోగిస్తున్నారు. మిగిలిన గదులు కూడా ఉరుస్తూ పెచ్చులూడి పడుతుండడంతో అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ భవనం దెబ్బతిని పెచ్చులూడుతోంది. అదే విధంగా పొదలు, ముళ్ల కంపల మధ్యలో నాణ్యత లేకుండా నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పోలీసులు క్వార్టర్స్‌లో ఉండేందుకు ఆసక్తి చూపడంలేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాంచాల్సిన అవసరం ఉంది.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ - అమ్మవారిని కొలువుదీర్చేందుకు ఏర్పాటు చేసిన పీఠం వద్ద పూజలు - ఆలయం వద్ద చలువ పందిళ్లు

నేడు పోలేరమ్మ జాతర

నాయుడుపేట/టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతర వేడుకగా సాగుతోంది. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన పోలేరమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఉదయం ఘటంతో ప్రారంభమయ్యాయి. ఘటం, దున్నపోతుకు గ్రామంలో ఇంటింటా హారతులు ఇస్తూ పూజలు చేసి మడిబియ్యం సమర్పించుకుంటున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి పీఠాన్ని నిర్మింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారి నిలుపు, బుధవారం జాతర నిర్వహించనున్నారు. సంప్రదాయం ప్రకారం అమ్మవారి పుట్టినిల్లు అయిన పడమటి వీధి బోయపాళెంలోని కుమ్మరిమిట్టలో పోలేరమ్మ విగ్రహాన్ని తయారు చేస్తారు. మంగళవారం రాత్రి అత్తవారి ఇల్లు అయిన శెట్టిపల్లివారి వీధిలోని అలంకరణ గుడికి తీసుకువస్తారు. అక్కడ అమ్మవారి విగ్రహానికి కళ్లు అమర్చి పూజలు నిర్వహిస్తారు. బుధవారం వేకువజామున సప్పరంపై పోలేరమ్మ కొలువుతీరిన వెంటనే బజారు వీధికి దక్షణం వైపు ఉన్న గ్రామస్తులంతా అమ్మవారికి కుంభాలు పోసి కోళ్లు, పొటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బజారు వీధి నుంచి బ్రాహ్మణ వీధి మీదుగా గడియారం సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. దారి పొడవునా భక్తులు పూర్ణకుంభాలు పోసి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామోత్సవం అనంతరం పోలేరమ్మ విగ్రహాన్ని గడియారం సెంటర్ వద్ద చావిడి ఎదుట చలువ పందిరిలో ప్రతిష్టిస్తారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం గ్రామ సరిహద్దుల్లో పొలికూడ చల్లి విన్నమాల గ్రామస్తులు బలి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం అత్తవారిల్లుగా పిలుచుకునే పాత పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో అమ్మవారు విడిది చేస్తారు. తరువాత బేరిపేట నుంచి సప్పరం తరలిరాగా పోలేరమ్మ గ్రామోత్సవానికి వెళుతుంది. దర్గా రోడ్డు సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం నిమజ్జనం కోసం రాజగోపాలపురానికి తరలడంతో పోలేరమ్మ జాతర ముగుస్తుంది.

వెంకటగిరిలో గాలివాన బీభత్సం



దక్షిణపు వీధిలో నేల కూలిన చెట్టు

వెంకటగిరి టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో గాలివానతో బీభత్సం సృష్టించింది. మంగళవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపించినప్పటికీ మధ్యాహ్నం తరువాత నల్లటి మబ్బులు కమ్మేశాయి. సాయంత్ర 5గంటల నుంచి ఈదురు గాలులు బలంగా వీచాయి. 5.30నుంచి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని దక్షిణపు వీధిలో ఓ భారీ వృక్షం, తహసీల్దార్ కార్యాలయం వద్ద వృక్షం నేల కూలాయి. రాణిపేట వద్ద ఉన్న ఆరు దుకాణాలపై రేకులు ఎగిరిపోయాయి. అలాగే పలుచోట్ల ఫ్లెక్సీలు, బ్యానర్లు కూలిపోయాయి. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పోలేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



పోలేరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ, రామకృష్ణ

నాయుడుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మను ఎమ్మెల్యేలు డాక్టర్ నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. వారికి జాతర కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, దేవదాయశాఖ ఈవో రవి కృష్ణ స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, మధుసూదన్‌రెడ్డి, చెంగాళమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, నెలవల రాజేష్, దార్ల రాజేంద్ర, గంగాప్రసాద్, జీవీఆర్ నాయుడు, మస్తాన్, పొట్లపూడి రాజేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ధనుంజయ, అన్నమనేని సాయి, నారాయణ, రవి, శ్రీనివాసులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటు మృతుల కుటుంబాలకు పరిహారం

నాయుడుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట, ఓజిలి మండలాల్లో పిడుగు పాటుకు మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ అందజేశారు. నాయుడుపేట మండలం వద్దిగుంటకండ్రిగకు చెందిన భాస్కర్, ఓజిలి మండలం గొల్లపాళెం గ్రామానికి చెందిన కార్తీ పిడుగుపడడంతో ఆదివారం మృతి చెందారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.4 లక్షల చొప్పున పరిహారం మంజూరైంది. మంగళవారం రాత్రి నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటున్న కార్తీక్ తండ్రి ప్రదీప్‌కు, వద్దిగుంటకండ్రిగలోని భాస్కర్ సతీమణి మునీలాకు చెక్కులను ఎమ్మెల్యే విజయశ్రీ అందజేశారు. ఈ కార్యక్రమాల్లో నాయుడుపేట, ఓజిలి తహసీల్దార్లు రాజేంద్ర, పద్మావతి, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, టీడీపీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

20, 21, 22 తేదీల్లో పారిశుధ్య కార్మికుల సమ్మె

గూడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా, 21, 22 తేదీల్లో గూడూరులో సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్స్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో రమేష్, కోటేశ్వరరావు, వెంకట రమణ, మురళి, అంకయ్య, ప్రసాద్, శివకుమార్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు వద్ద మంగళవారం బస్సు, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో స్క్యూటరిస్ట్ వెంకటకృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. వాకాడు ఆర్టీసీ డిపోకు చెందిన ముత్తుకూరు బస్సు కోటకు వెళ్తుండగా కొక్కుపాడు మలుపువద్ద వెంకటకృష్ణారెడ్డి వెళ్తున్న మోటర్ బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటకృష్ణారెడ్డి కాలు విరిగింది. స్థానికులు ఆయనను కోట ఆస్పత్రికి తరలించారు.

మామిడి ఎగుమతి కేంద్రం పరిశీలన

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు మార్కెట్‌యార్డులోని వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ కేంద్రాన్ని రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ద్వారా మామిడికాయల క్యూరింగ్, కూలింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్రాసెసింగ్ తరువాత మామిడికాయలను నెదర్లాండ్, జర్మనీ, యూకే, న్యూజిల్యాండ్, సౌత్‌కొరియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు కలెక్టర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రోజుకు పది టన్నులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఆర్డీవో రామ్మోహన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

బీభత్సం సృష్టించిన అకాల వర్షం

- చల్లబడిన వాతావరణం
- రాలిపోయిన మామిడి కాయలు



పుత్తూరులో కురుస్తున్న వర్షం

పుత్తూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలో రెండు గంటల పాటు గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం 6గంటలకు ప్రారంభమైన గాలివాన రాత్రి 8గంటల వరకు పడింది. ఈ రెండు గంటల్లో దాదాపు 15 మి.మి వర్షపాతం నమోదైంది. అంతో ఇంతో చేతికి పంట వచ్చే సమయంలో గాలివానకు మామిడి కాయలు రాలిపోవడంతో రైతు గుండె జారిపోయింది. మామిడి పంట నష్టం అంచనా రేపటికి కానీ సమగ్రంగా వేయలేని పరిస్థితి నెలకొంది. గాలి బీభత్సం వల్ల మున్సిపాలిటీ పరిధిలోని కెఎం అగ్రహారం వద్ద చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభం మీద పడడంతో నేలకొరిగిపోయింది. రాత్రి వేళ కావడంతో ఆ ప్రాంతంలో సరఫరా పునరుద్ధరణ రేపటికి వాయిదా వేసినట్లు ఏఈ సాయి తెలిపారు. పట్టణంలో పోలీసు స్టేషన్, నారాయణవనం రైల్వే గేటు, గేటుపుత్తూరు ప్రాంతాలలో విద్యుత్ లైన్లు తెగిపోవడంతో సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టామని అన్నారు. రోజంతా విపరీతమైన ఎండ వేడిమికి తహతహలాడిన ప్రజలకు సాయంత్రం పడిన వాన కాస్తంత ఊరట నిచ్చింది. జోరున కురిసిన వర్షం కారణంగా మురుగు కాల్వలు పొంగి రోడ్ల మీద మోకాటి లోతుగా నీళ్లు ప్రవహించాయి. వర్షం ఆగిన తర్వాత ఆటోలు, ద్విచక్రవాహనాలు, బస్సులు ఒక్కసారిగా రోడ్డు మీద పరుగులు తీయడంతో కార్వేనగరం కూడలి వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. బారులు తీరిన వాహనాలను క్లియర్ చేసేందుకు పోలీసులకు చాలా సమయం పట్టింది. ఈ అకాల వర్షం రాకకు పుత్తూరు చుట్టు పక్కల గ్రామాల్లో జరుగుతున్న గంగమ్మతల్లి జాతర్ల ప్రభావమని ప్రజలు భావిస్తున్నారు.

- వడమాలపేట (ఆంధ్రజ్యోతి): వడమాలపేట పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం అర్ధగంట పాటు వర్షం కురిసింది. ఎండ వేడికి అల్లాడిన ప్రజలకు ఈదురు గాలులతో కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. మామిడి రైతులు కాయ సైజుకు వచ్చిన సమయంలో వర్షంతో మచ్చలు ఏర్పడుతాయని భయపడుతున్నారు.

కుక్కల స్టెరిలైజేషన్ కోసం శాశ్వత కేంద్రాలు

- పురపాలక శాఖకు ప్రతిపాదనలు పంపిన ఆయా మున్సిపల్ అధికారులు

పుత్తూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో కుక్కల పునరుత్పత్తి నియంత్రణలో స్టెరిలైజేషన్ ప్రక్రియ కోసం ఆయా మున్సిపాలిటీలలో శాశ్వత కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని మున్సిపాలిటీలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా ఆయా మున్సిపాలిటీలలో కుక్కల సంఖ్య, స్టెరిలైజేషన్‌కు అయ్యే ఖర్చు, స్థలం, భవన నిర్మాణానికి అయ్యే ఖర్చు తదితర అంశాలతో కూడిన ప్రతిపాదనలను పురపాలక శాఖ ఉన్నతాధికారులకు పంపారు. కుక్కల పునరుత్పత్తి నియంత్రణలో మున్సిపాలిటీలు ప్రైవేటు సంస్థలకు ఎక్కువ మొత్తంలో చెల్లిస్తుండటంతో పురపాలక శాఖ శాశ్వత కేంద్రాల ఏర్పాటు చొరవ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పుత్తూరు మున్సిపాలిటీలో కుక్కల పునరుత్పత్తి నియంత్రణకు ఒక్కో కుక్కకు రూ.700 చెల్లిస్తున్నట్లు కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చింది. ఇలా ఆయా మున్సిపాలిటీలలో కుక్కల సంఖ్య ఆధారంగా ప్రైవేటు సంస్థలకు రూ.లక్షలు చెల్లిస్తున్నారు. కమిషనర్ ఉత్తర్వుల మేరకు పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళంలో సర్వేనంబర్ 253లో అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పాదిరేడులో ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

వడమాలపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. మండలంలో పాదిరేడులో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ నెల 8వ తేదీ వరకు ప్రత్యేక శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రత్యేక శిబిరాల్లో విద్యార్థులు, ప్రజలు తగు ఆధారాలతో నూతన ఆధార్ నమోదు చేసుకోవాలని చెప్పారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేయండి

వడమాలపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండలంలోని ఎస్బీఐ, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వడమాలపేట, బ్యాంక్ ఆఫ్ ఇండియా కాయంపేటల ద్వారా 26 మందికి రుణాలు మంజూరైనట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన నిర్ణీత స్కీమ్‌ల ద్వారా మాత్రమే అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్కీమ్‌ల వివరాల కోసం దరఖాస్తు దారులు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాస్ సేవలు అభినందనీయం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుత్తూరు టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): రాస్‌సేవలు అభినందనీయమని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. మంగళవారం రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మునిరత్నం 4వ వర్ధంతి సందర్భంగా పుత్తూరు పట్టణంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గంజి మాధవయ్య మాట్లాడుతూ రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. శంకర్ నేత్రాలయ వారి సహకారంతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్లకు రోగులను సిద్ధం చేశారు. వృద్ధురాళ్లకు ఉచితంగా చీరలను, నడవలేనివారికి చేతి కర్రలను అందజేశారు. జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, తేజ, మునిశేఖర్, ప్రకాష్, ఏకాంబరం, మణి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కమిటీల నియామకానికి సమాయత్తం కావాలి: టీడీపీ



ఏఎం పురంలో గ్రామ కమిటీ నియామక పత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 పంచాయతీల్లో టీడీపీ గ్రామకమిటీల నియామకం కోసం నాయకులను సమాయత్తం చేస్తున్నట్లు ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య చెప్పారు. మంగళవారం మండలంలోని ఏఎం పురంలో గ్రామ కమిటీని నియమించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీలు క్షేత్ర స్థాయిలో బలోపేతంగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, జానా వెంకటయ్య, సురేష్ రాజు, మునిశేఖర్, లక్ష్మీప్రసన్న, హేమవతి, దేవ, హరినాయుడు, శివరాయల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల నియామకం

పుత్తూరు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండల పరిధిలోని నేసనూరు, గోపాలకృష్ణాపురంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక నిర్వహించారు. మండల ఎన్నికల పరిశీలకులు రవి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నేసనూరు పంచాయతీలో సమావేశం జరిగింది. నేసనూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా మోహన్, గోపాలకృష్ణాపురం గ్రామ అధ్యక్షుడిగా గంగాకుమార్, ప్రధాన కార్యదర్శిగా తేజలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు. పుత్తూరు గ్రామీణ మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి అరవ బాలాజీ, కరుణ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

గజ వాహనంపై సదాశివుడి చిద్విలాసం



పుత్తూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలో వెలసియున్న కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు నంది వాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి గజ వాహనంపై పుత్తూరు పట్టణ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలతో స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా అయూబ్‌ఖాన్, గురవయ్య



అయూబ్‌ఖాన్ - గురవయ్య

తిరుపతి(ఆటోనగర్) మే 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) డైరెక్టర్లుగా పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్యలను నియమిస్తూ ప్రభుత్వ ఇంధనశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 30న పదవీ విరమణ చేసిన అయూబ్ ఖాన్‌ను ప్రాజెక్ట్సు డైరెక్టర్‌గా, గత ఏడాది మే31న పదవీ విరమణ చేసిన కె.గురవయ్యలను టెక్నికల్ డైరెక్టర్‌గా నియమించారు.

ఎంఎస్ఎంఈ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మే 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద ప్రభుత్వం నూతన పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే విధంగా ఏపీ ఎంఎస్ఎంఈ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0ను మంగళవారం ఏపీఐఐసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ముందు చూపుతో రాబోయే 20 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆ కార్యక్రమానికి శ్రీకాళహస్తిలో కూడా శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం

- డ్రైవర్ అరెస్టు



పిచ్చాటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... స్థానికులు అందించిన సమాచారంతో పక్కాగా మాటు వేసిన పోలీసులు తమిళనాడుకు తరలుతున్న అక్రమ ఇసుక టిప్పర్‌ని మంగళవారం ఉదయం అప్పలరాజుకండ్రిగ పరిసరాల్లో స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా, తమిళనాడుకు చెందిన పొన్నేరి పట్టణ వాసి ముత్తు కుమార్ ఈ ఇసుక స్మగ్లింగ్‌లో సూత్రధారి అని చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. అతడిని త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. స్థానికంగా కూడా కొంతమందికి అక్రమ ఇసుక రవాణాలో ప్రమేయం ఉందని, సమాచారం సేకరిస్తున్నామని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

అసంఘటిత కార్మికులకు రక్షణ ఈ-శ్రామ్ కార్డులు



కార్మికులకు ఈ-శ్రామ్‌కార్డులను అందజేస్తున్న రంగనాథ్, న్యాయవాదులు

శ్రీకాళహస్తి, మే 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని రామసేతు వంతెన వద్ద న్యాయ వారోత్సవాలు, అంతర్జాతీయ కార్మిక దినోత్సవాలను పురస్కరించుకుని జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం అసంఘటిత కార్మికులకు ఉచితంగా ఈ-శ్రామ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రంగనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం అసంఘటిత కార్మికులకు రక్షణగా ఉంటుందన్నారు. ఈకార్డు వల్ల 60 ఏళ్ల తరువాత పింఛను, ప్రమాదబీమా వంటి ఉపయోగాలు ఉన్నాయన్నారు. దీనిని ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, శ్రీరామ్, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎండల్లో తప్పని ఉపాధి పనులు



మండుటెండలోనే పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

కేవీబీపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండ్రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఉపాధి పనులు జోరందుకున్నాయి. దీంతో ఉపాధి కూలీలు చెరువు, కాలువ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నా పనులకు వెళుతున్నారు. అయితే కనీస వసతులు కూడా అందుబాటులో లేవు. తాగునీరు, నీడ ఏర్పాటుచేయలేదు. దీంతో కొంతమంది వడదెబ్బ బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలోలాగా తాగునీరు, ప్రథమచికిత్స తదితర ఏర్పాట్లు చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

వైభవంగా కాలభైరవ స్వామి ప్రాకార ఉత్సవం



హారతులు సమర్పిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మే 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం



స్వామి అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మే 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం మంగళవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపం నుంచి స్వామి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రమణీయంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడు కండ్రిగ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం తలారివెట్టు, కల్లివెట్టు తదితర గ్రామాల్లో కరపత్రాలతో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో తమ పాఠశాలలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించామని, క్రమశిక్షణతో కూడిన విద్య, నైపుణ్యంతో కూడిన ఉపాధ్యాయులచే విద్యా బోధన జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ, మురళి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

సత్యవేడు, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధ, గురువారం రోజుల్లో సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో కూటమి నాయకులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, కో ఆర్డినేటర్ శ్రీపతిబాబు, అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు, నాయకులు దశరథవాసు, మస్తాన్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పరమశివం, మునస్వామియాదవ్, సుధాకర్ నాయుడు, పద్మనాభరాజు, సతీష్ నాయుడు, గిరి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లోకేశ్ పర్యటన నేపథ్యంలో పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సత్యవేడు సీఐ మురళి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న సిబ్బంది

నారాయణవనం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలసియున్న పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో మే 11 నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి తోమాల సేవ కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్యులు, ఆలయాధికారి నాగరాజు, భరత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై అగస్తీశ్వరుడి దివ్యదర్శనం

నారాయణవనం, మే 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధంగా మండలంలోని సముదాయంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారిని తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. మంగళవారం కురిసిన భారీ వర్షం కారణంగా ఈ రోజు జరగాల్సిన గజ వాహన సేవకు బదులుగా తిరుచ్చి వాహనంపై స్వామి విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజలనంతరం, మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ స్వామివారిని తిరుచ్చి వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ముదిరాజ్ రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీగా శివకుమార్



రేణిగుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముదిరాజ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా పోలి శివ కుమార్ ఎంపికయ్యారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన ముదిరాజ్ కమ్యూనిటీ అఖిల భారతీయ కోలీ సమాజ్ సమావేశంలో ఏపీ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఇందులో రేణిగుంట మండలం గురురాజుపల్లి పంచాయతీ రామకృష్ణాపురానికి చెందిన పోలి శివ కుమార్‌ను రాష్ట్ర ముదిరాజ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కమిటీ జాతీయ అధ్యక్షులు వీరేంద్ర కష్యాప్, మాజీ ఎంపీ, రాష్ట్ర అధ్యక్షులు పీవీఎల్ఎన్ రాజుకు శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుటుంబసభ్యులు

శ్రీకాళహస్తి, మే 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఊరందూరులోని ఆయన సమాధి వద్ద ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి, కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోకు సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటరత్నమ్మను ఈవోపీఆర్డీ రాజశేఖర్, కార్యదర్శులు మంగళవారం సన్మానించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కార్యదర్శుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు.

గంగమ్మకు అంబళ్లు



గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీపీ అగ్రహారంలో గల గంగమ్మ ఆలయంలో జాతర పురస్కరించుకుని మంగళవారం చాటింపు జరిగింది. అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అంబళ్లు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుడు సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ 13, 14తేదీల్లో జాతర జరుగుతుందని, 13న పొన్నాలమ్మకు పొంగళ్లు, రాత్రి అమ్మవారి కొలుపు, 14న గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారిని నిలుపు, రాత్రి నిమజ్జన కార్యక్రమం ఉంటుందన్నారు. కృష్ణారెడ్డి, వెంకటమునిరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో భారీ వర్షం

- లోతట్టు వీధులు జలమయం
- రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం





శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద కురుస్తున్న వర్షం - పాతబస్టాండు వద్ద జలమయమైన రోడ్డు

శ్రీకాళహస్తి, మే 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కారుమబ్బులు కమ్ముకుని ఆకాశం మేఘావృతమైంది. భారీ ఉరుములు, మెరుపులతో హోరు గాలులు దారెత్తించాయి. సాయంత్రం 6.10 గంటల నుంచి జోరువాన మొదలైంది. ఎడతెరపి లేకుండా సుమారు గంటపాటు కుంభవృష్టిగా వర్షం కురిసింది. ఒకవైపున వాన, మరోవైపున ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భయానక వాతావరణం నెలకొంది. 7.10 గంటలకు వర్షం తెరపినిచ్చింది. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కుంభవృష్టిగా కురిసిన వర్షంతో పట్టణంలోని పలు లోతట్టు వీధులు జలమయమయ్యాయి. మురుగుకాలువలు పొంగి వాన నీరు రోడ్డుపై ప్రవహించింది.

ముక్కంటి ఆలయంలో ముత్యాల జల్లు

మంగళవారం సాయంత్రం హఠాత్తుగా జోరు వాన కురిసిన సమయంలో ముక్కంటి ఆలయంలో రమణీయ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. ఆలయంలోని సూక్ష్మనంది స్థూపం, మహాద్వారం వద్ద సాయం సంధ్యవేళ ఆకాశంలో మబ్బులు లేలేత కాంతులతో సుందరంగా దర్శనమిచ్చాయి. ఆ తరువాత కంచుగడప ఎదుట ఉన్న స్వర్ణ తాపడ ధ్వజస్తంభం పక్కన వాన చినుకులు పసిడి కాంతుల్లో ముత్యాల జల్లులా జాలువారే దృశ్యం భక్తులను ఎంతగానో ఆకట్టుంది.

ఈవోపీఆర్డీపై డీఎల్పీవో విచారణ



విచారణ చేస్తున్న డీఎల్పీవో, రెవెన్యూ సిబ్బంది

రేణిగుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూకివాకం పంచాయతీ సంజీవరాయపట్టెడలో సర్వే నెంబర్ 12, 13లో యజమానికి కాకుండా మరొకరికి ఎన్వోసీ జారీ చేయడంపై డీఎల్పీవో ప్రభురెడ్డి సంబంధిత ఈవోపీఆర్డీ ప్రభురావుపై మంగళవారం విచారణ జరిపారు. గత నెల 26వ తేదీన చేసిన విచారణకు రెవెన్యూ సిబ్బంది రాకపోవడంతో వాయిదా పడిన నేపథ్యంలో మంగళవారం సంజీవరాయపట్టెడలో ఇల్లు నిర్మించిన ప్రాంతాన్ని శ్రీకాళహస్తి డీఎల్పీవో ప్రభురెడ్డి, వీఆర్వో శ్రీధర్, సర్వేయర్ యువరాజులు ఇరుపక్షాల సమక్షంలో కొలతలు వేశారు. అయితే సర్వే నెంబర్ 12/2 భూమిని తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకుని, సర్వేనెంబర్ 13లో ఇంటిని నిర్మించారని రెవెన్యూ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయంపై డీఎల్పీవో ప్రభురెడ్డి జిల్లా పంచాయతీ అధికారికి విచారణ నివేదికను అందజేయాల్సి ఉంది. ఈ విచారణలో ఈవోపీఆర్డీ ప్రభురావు, ఇన్‌చార్జి కార్యదర్శి చంద్రిక, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ

రేణిగుంట మేజర్ పంచాయతీకి సంబంధించి 2020 - 21లో రూ.27 లక్షల పంచాయతీ నిధుల దుర్వినియోగంపై అప్పటి పంచాయతీ క్లర్క్‌ను సస్పెండ్ చేయగా, అప్పటి పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీ విచారణ ఎదుర్కొంటున్నారు. గతేడాది మార్చిలో ఆంధ్రజ్యోతిలో రేణిగుంట మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై చర్యలేవి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీపీవో సుశీలాదేవి ఆదేశాల మేరకు తిరుపతి డీఎల్పీవో సురేష్ నాయుడు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, సస్పెండ్ అయిన క్లర్క్ శివశంకర్ హాజరు కాగా, ఈవోపీఆర్డీ నీలకంఠేశ్వరరెడ్డి గైర్హాజరు కావడంతో విచారణ వాయిదా పడినట్లు సమాచారం.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



వైద్యపరీక్షలకు హాజరైన మహిళలు

శ్రీకాళహస్తి, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పానగల్‌లోని రాస్ మహిళా వాణి కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుత్తా మునిరత్నం వర్ధంతి సందర్భంగా మంగళవారం టాటా ట్రస్టు సహకారంతో పొదుపు సంఘాల మహిళలకు ఉచిత క్యాన్సర్ మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా మునిరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహిళలకు రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కెనరాబ్యాంకు సహాయంతో కొంతమందికి కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. రాస్ సంచాలకులు నాగరాజు, టాటా ట్రస్టు ఆస్పత్రి వైద్యులు వెంకయ్యబాబు, హేమంత్‌కుమార్, రెడ్డికుమారి, మెహతాజ్, అమరావతి, మహేంద్ర, సంఘ సభ్యులు, క్లస్టర్ లీడర్లు, రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- రేణిగుంట (ఆంధ్రజ్యోతి): రాస్ మహిళ జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కెనరా బ్యాంకు సహకారంతో పేదలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. రాస్ సంచాలకులు నాగరాజు, కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసర్లు దీప ప్రజ్వలన, వైస్ ప్రిన్సిపాల్ తారకేశ్వర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ చంద్రయ్య, సుజన్‌కుమార్, మేనేజర్ కాళప్ప, రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, సిబ్బంది, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధులకు ట్రైసైకిల్ పంపిణీ

- ఏర్పేడు (ఆంధ్ర జ్యోతి): పాపానాయుడుపేటలో తిరుపతికి చెందిన వాసన్ ఐకేర్ ఆస్పత్రి వైద్యులు పేదలకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. నారాయణాద్రి ఆస్పత్రి వైద్యురాలు స్రవంతి పలువురిని పరీక్షించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వాసన్‌ఐకేర్ ఆస్పత్రిలో రాస్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నారు. ప్రాజెక్టు ఆఫీసర్ బాలాజీరెడ్డి వృద్ధులకు ట్రైసైకిల్, చేతికర్రలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ అన్నాదొరై, ప్రాజెక్టు ఆఫీసర్ హరిబాబు, వాసన్‌ఐకేర్, నారాయణాద్రి ఆస్పత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

పిచ్చాటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం కీళపూడి సచివాలయంలో సూపర్‌వైజర్ మరియమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం కిశోరి వికాసం వేసవి శిక్షణ ఎంఈవో హేమమాలిని అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలు, బాలికల హక్కులు, రక్తహీనతపై అవగాహన కల్పించారు. గుడ్ అండ్ బాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు ఎస్.లక్ష్మి, టీచరు పార్వతి, అంగన్‌వాడీ వర్కర్స్, వెలుగు సిబ్బంది, ఆశ వర్కర్లు, బాలికలు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

రేణిగుంట మే 6 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు పేకాట రాయులను గాజులమండ్యం పోలీసులు మంగళవారం రాత్రి గువ్వల కాలనీలో అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గువ్వలకాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద రూ.2400 స్వాధీనం చేసుకున్నారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన దినేష్

ఏర్పేడు, మే 6(ఆంధ్ర జ్యోతి): ఏర్పేడు మండలం రాజులకండ్రిగ వద్ద ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక ద్విచక్ర వాహనం నడిపిన ఎండీపుత్తూరు దళితవాడకు చెందిన దినేష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడ్డ దినేష్‌ను బంధువులు పాపానాయుడుపేటకు వైద్యం కోసం తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

ధ్వంసమైన మామిడి తోటల పరిశీలన



మామండూరులో మామిడి పంట నష్టాన్ని పరిశీలిస్తున్న కోట వినుత

రేణిగుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): గడిచిన 20 రోజులుగా మామండూరులో ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి తోటలను జనసేన ఇన్చార్జి కోట వినుత పరిశీలించారు. మంగళవారం పంట నష్టపోయిన మామిడి రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి రైతులు మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని, ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఆమె రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల జనసేన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బుచ్చినాయుడుకండ్రిగ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైనుకు మరమ్మతులు చేపట్టారు. గత మూడ్రోజుల క్రితం పైపులైన్ లీకేజిని అరికట్టండి శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన సర్పంచి వెంకటమ్మ, ఉపసర్పంచి మునిరాజా మంగళవారం పైపులైనుకు మరమ్మతులు చేట్టి తాగునీటిని అందించారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, మే 6 (ఆంధ్రజ్యోతి): రీసర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరిస్తేనే భూములు సర్వే చేయగలమని డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు తెలిపారు. మండలంలో తిమ్మాభూపాలపురంలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. రీ సర్వేతో భూసమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతుందన్నారు. ప్రతి రైతు విధిగా రీసర్వేకు సహకరించాలని కోరారు.